
పల్లె దవాఖానాలకు మోక్షమెప్పుడో?

ఇసుక తవ్వకాలపై గరం..గరం..

6లో..



ప్రమాదకరంగా బూడిద చెరువులు

- ఆర్ఎఫ్‌సీఎల్ ఆవరణలో క్వారీలుగా మారిన యాష్‌పాండ్‌లు
- మట్టి పోసి లెవల్ చేయించని ఎఫ్‌సీఐ, ఆర్ఎఫ్‌సీఎల్
- రక్షణ చర్యలు చేపట్టాలని ఇప్పటికే హైకోర్టు ఆదేశాలు
- అయినా స్పందించని వైనం



బూడిద తీసిన పాత యాష్‌పాండ్

కోల్‌సిటీ, ఏప్రిల్ 7: రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్) ప్రాంగణంలోని బూడిద చెరువులు(యాష్‌పాండ్) ప్రమాదకరంగా మారాయి. యాష్‌పాండ్‌లలోని లక్షల క్యూబిక్ మీటర్ల బూడిదను తరలించుకుపోవడంతో అవి క్వారీలుగా మారాయి. ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమ పరిధిలోని ఓల్డ్ యాష్‌పాండ్, శాంతినగర్ సమీపంలోని ఆక్సిడేషన్ పాండ్లు బూడిద తరలించాక మట్టి పోసి లెవల్ చేయించకపోవడంతో అవి భారీ గొయ్యిలతో ప్రమాద కరంగా మారాయి. వర్షాకాలంలో వీటిలో నిల్వలు పేరుకుపోతే సమీప కాలనీలతో పాటు ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమకు కూడా ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఉంది.



వర్షాకాలంలో తెగిన బూడిద చెరువు కట్ట (ఫైల్)

ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమ ప్రాంగణంలో పాత యాష్‌పాండ్ ఉంది. గతంలో ఎఫ్‌సీఐ బొగ్గు ఆధారిత పరిశ్రమ కావడంతో యాష్ పాండ్ నిర్వహించారు. పరిశ్రమ మూతపడే వరకు అందులో నుంచి బూడిద తీయకపోవడంతో పూర్తిగా నిండిపోయింది. పరిశ్రమ మూతపడడంతో సమీపంలో జీడీకే 7ఎల్ఈపీ బొగ్గుగనిని తవ్వారు. ఆర్ఎఫ్‌సీఎల్ ప్రాంగణంలోనే గనిలో ఇసుక నింపేందుకు సాండ్ స్టోవింగ్ ప్లాంట్ పెట్టారు. ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమ కిందనే అండర్ గ్రౌండ్ బొగ్గు తవ్వకాలు జరిగాయి. అనంతరం 7ఎల్ ఈపీ గనిని మూసివేశారు. ఇదే గనిలో నీటి ప్రమాదం జరిగిన 17మంది కార్మికులు మృత్యువాతపడ్డారు. ఆర్ఎఫ్‌సీఎల్ ప్రాంగణం లోని ఓల్డ్ యాష్‌పాండ్‌లో గతంలో బూడిద అమ్మకాల పేర ఎఫ్‌సీఐ కాంట్రాక్టు ఇచ్చింది. ఏడాదిలో బూడిద తొలగించాలని, తరువాత మట్టి పోసి చదును చేసి ఇవ్వాలని ఒప్పందంలో పేర్కొన్నారు. కాంట్రాక్టర్లు పరిశ్రమ ప్రాంగణంలో బూడిద చెరువుతో పాటు శాంతినగర్ సమీపంలోని ఆక్సిడేషన్ ప్లాంట్ నుంచి బూడిద తరలించారు. 2017 నాటి టెండర్ పొడిగించుకుంటూ వస్తుండడంతో కాంట్రా క్టర్లు లక్షల క్యూబిక్ మీటర్ల బూడిదను తరలించుకుపోయారు. ఆర్ఎఫ్‌సీఎల్ ప్రాంగణంలోని బూడిద చెరువులో తవ్వకాలు జరుపడంతో అది క్వారీలా ఏర్పడింది. నిబంధనల ప్రకారం అందులో మట్టి నింపి చదును చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న యాష్ పాండ్‌లో భారీ గొయ్యిలు యధాతథంగా ఉంచితే వర్షాకాలంలో పెద్దఎత్తున నీరు చేరే ప్రమాదం ఉంది.

● ఎఫ్‌సీఐ నిర్లక్ష్యమే సమస్యకు మూలం..

మూతపడిన ఎఫ్‌సీఐ స్థానంలో ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమ నిర్మించినా పాత యాష్‌పాండ్‌లోని బూడిదపై తమ హక్కులు అంటూ ఎఫ్‌సీఐ విక్రయాలు జరిపింది. ఎఫ్‌సీఐకి సంబంధించి రామగుండంలో పర్మినెంట్ ఉద్యోగులు కానీ, అధికారులు కానీ లేరు. కేవలం అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన రిటైర్డ్ అధికారులు మాత్రమే పనిచేస్తున్నారు. బూడిద తీసినచోట పూర్తిగా మట్టి నింపి చదును చేయించడంలో, బూడిద కట్టలు పటిష్టపర్చడంలో ఎఫ్‌సీఐ పూర్తిగా విఫలమైంది. ఎఫ్‌సీఐ చర్యలకు ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యంతో పాటు సమీప కాలనీల ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఎఫ్‌సీఐ, ఆర్ఎఫ్‌సీఎల్ తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

● పరిశ్రమకూ ప్రమాదమే..

ఆర్ఎఫ్‌సీఎల్ నిర్మాణ సమయంలో పరిశ్రమ ఆవరణలో భారీ రిజర్వాయర్లు నిర్మించారు. వాటిని పూర్తిగా ఊటలు లేకుండా కాంక్రీట్ బెడ్‌తో పకడ్బందీగా నిర్మించారు. వీటిలో పెద్ద ఎత్తున నీటిని నిల్వ చేస్తున్నారు. కానీ ఎఫ్‌సీఐ పాత యాష్‌పాండ్‌లో నీరు నిల్వ ఉంటే పరిశ్రమలోని వివిధ విభాగాల్లో ఊటలు వస్తాయని ఇంజనీర్లే పేర్కొంటున్నారు. దీని వల్ల పరిశ్రమకు కూడా ప్రమాదం ఏర్పడుతుందంటున్నారు. దీనికి తోడు ఎఫ్‌సీఐ ఆర్ఎఫ్‌సీఎల్ పక్కనే 7ఎల్ఈపీ గని ఉండడంతో ఉపరితలంలో నీటి నిల్వలు ప్రమాదకరంగా మారుతాయని, మూతపడిన గనిలోకి నీటి ప్రవాహం వెళితే పరిస్థితి ఏమిటన్న ఆందోళన కూడా వ్యక్తమవుతోంది.



సహాయ చర్యల్లో పాల్గొన్న ప్రస్తుత ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, మేయర్ అనిల్‌కుమార్(ఫైల్)

● వర్షాకాలం వచ్చిందంటే వణుకు..

ఆర్ఎఫ్‌సీఎల్‌కు చెందిన యాష్‌పాండ్ శాంతినగర్ వద్ద ఉంది. ఈ బూడిద చెరువు కట్టలు పటిష్టంగా లేకపోవడంతో వర్షాకాలంలో కట్టలు తెగి శాంతినగర్‌లోకి వరదనీరు వస్తోంది. వరుసగా రెండేళ్లుగా శాంతినగర్‌లో ఇళ్లు నీటమునిగాయి. దీనికి తోడు ఆర్ఎఫ్‌సీఎల్ ప్రాంగణంలోని పాత యాష్‌పాండ్ వర్షం నీటితో నిండితే పరిస్థితులు మరింత భయంకరంగా మారనున్నాయి. ఇప్పటికే శాంతినగర్, సంజయ్ గాంధీనగర్ వాసులు హైకోర్టును ఆశ్రయించగా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్ఎఫ్‌సీఎల్, మున్సిపల్ కార్పొరేషన్, కలెక్టర్‌ను కోర్టు ఆదేశించింది.

నేడు ఖనిలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సభ

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఏప్రిల్ 7: కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సభ సోమవారం గోదావరిఖని దుర్గానగర్‌లోని ఆర్‌కే గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్టు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ తెలిపారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారని, ఈ ఎన్నికల్లో వ్యవహరించాల్సిన వ్యూహాలను దిశానిర్దేశం చేయనున్నట్టు ఆయన తెలిపారు. ప్రతి బూత్ నుంచి పది మంది బూత్ కమిటీ సభ్యులు, బూత్ స్థాయి బీఎల్ఏలు, డివిజన్ అధ్యక్షులు, ఎస్సీ, బీసీ, మైనార్టీ, మహిళా అధ్యక్షులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ఎన్ఎస్‌యూఐ, యువజన విభాగం, క్లస్టర్లతో పాటు కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, పాల్గొన్న నాయకులు

గోదావరిఖని, ఏప్రిల్ 7 : కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పార్టీ శ్రేణులకు సూచించారు. ఆదివారం ఎన్టీపీసీలోని ఎస్ఎస్ గార్డెన్స్‌లో జరిగిన బీఆర్ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశంలో కొప్పుల ఈశ్వర్ ప్రసంగించారు. నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచారానికి సంబంధించిన విధివిధానాలపై ఈశ్వర్ బీఆర్ఎస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల హామీలను నెరవేర్చని కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపాన్ని ప్రజల్లో తీసుకెళ్లి ప్రభుత్వాన్ని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. మాట తప్పిన కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ కొద్దిరోజుల్లోనే అనేక మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాత్రం ఒక్క రైతు కూడా ఆత్మహత్య చేసుకోలేదని మాట్లాడుతున్నాడన్నారు. ఈ 100 రోజుల్లోనే రాష్ట్రంలో 209 మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఇచ్చిన ఏ హామీని నిలబెట్టుకోలేని కాంగ్రెస్‌కు ఓటడిగే నైతిక హక్కు లేదని ఈశ్వర్ స్పష్టం చేశారు. తాను సాదాసీదా మనిషినని, ప్రజల మధ్యలో ఉండే నాయకుడినని, ప్రజల కోసమే పనిచేసేవాడినన్నారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ పుట్ట మధు, దావ వసంత, జక్కు శ్రీహర్షిని, మాజీ ఎంఎల్ఏలు, కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, బాల్క సుమన్, దుర్గం చిన్న, దివాకర్‌రావు, పెద్దపల్లి పార్లమెంటు పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పథకాల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలం

- పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గొమాసే శ్రీనివాస్



నిమ్మనపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న గొమాసే శ్రీనివాస్

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 7 : సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గొమాసే శ్రీనివాస్ అన్నారు. శనివారం రాత్రి పెద్దపల్లి మండలంలోని నిమ్మనపల్లి గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరుగుతూ దేశంలో ప్రధాని మోదీ అమలు చేస్తున్న పథకాలపై వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలు చేసిందని, వాటిని అమలుచేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్రంలో మరోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. వారి వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిలారపు పర్వతాలు, మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్, బూత్ అధ్యక్షుడు లక్ష్మణ్, మండల జనరల్ సెక్రెటరీ వేల్పుల రమేష్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు శ్రీధర్, యూత్ అధ్యక్షుడు ఉమేష్, నాయకులు రాజేందర్, సతీష్, శ్రీనివాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ముస్లింలకు పండ్లు తినిపిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



ముస్లింలకు పండ్లు తినిపిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 7: రామగుండం 41వ డివిజన్‌లోని గాంధీనగర్ నురాని మసీదులో ఆదివారం డివిజన్ అధ్యక్షుడు ఫజల్ బేగ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు ఎళ్లప్పుడు అండగా ఉంటుందని, వారికి 12శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలుచేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలీండర్, 200యూనిట్ల వరకు గృహ జ్యోతి పథకం, రూ.10లక్షల ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇల్లు వంటి పథకాలను అమలుచేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, నాయకులు గట్ల రమేష్, కుడిదెల శివ, ఊట్ల కిరణ్ పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న కొప్పుల ఈశ్వర్, దాసరి మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్, ఏప్రిల్ 7: సుల్తానాబాద్ పట్టణంలోని ముస్లింలకు రంజాన్ పండుగను పురస్కరించుకుని ఇఫ్తార్ విందును ఎమ్మెల్యే విజయరమణారావు ఏర్పాటుచేశారు. స్థానిక పద్మనాయక కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విందులో ఎమ్మెల్యే పాల్గొని వారితో ముందుగా ప్రార్థనలు చేశారు. అనంతరం తన చేతుల మీదుగా ముస్లింలకు పండ్లు స్వీట్లు తినిపించారు. పట్టణంలోని ముస్లింలు ఈ విందుకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముస్లిం మత పెద్దలు,కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏటా ముస్లింలకు రంజాన్ సందర్భంగా విందు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

పెద్దపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ హయాంలో ముస్లింల సంక్షేమానికి ఎనలేని కృషి చేసిందని మాజీ మంత్రి,పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ట్రినిటి ప్రైమరీస్కూల్‌లో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ నజ్మీన్ సుల్తానా-మోబిన్, మొల్సాబ్ మహమ్మద్ యుసుఫ్, జానీ, ఇమ్రాన్, పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, బెక్కం ప్రశాంత్, స్వామి, ఖాదీర్‌ఖాన్, ఆశ్రఫ్, జువెద్, వహీం, తబ్రేజ్, ఆజీజ్, సలెంద్ర రాములు, కుంభం సంతోష్, బండి సంతోష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



ఖనిలో పోచమ్మ గుడి వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



సుల్తానాబాద్‌లో పోచమ్మ బోనాలతో వెళుతున్న మహిళలు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 7: ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం గోదావరిఖనిలోని పలు పోచమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గోదావరిఖని చౌరస్తాలోని పోచమ్మ ఆలయంలో తెల్లవారుజామున 5గంటల నుంచే భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. బాపూజీనగర్, పవర్‌హౌస్‌కాలనీ, ఐబీకాలనీ, ఫైవింక్లయిన్, విఠల్ నగర్, చంద్రబాబుకాలనీ, ఇందిరానగర్‌లోని పోచమ్మ ఆలయంలో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు నెత్తిన బోనం పెట్టుకుని డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వచ్చి పోచమ్మకు మొక్కులు సమర్పించారు. ప్రధాన చౌరస్తాలో పోచమ్మ ఆలయం వద్ద భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో కార్పొరేషన్ అధికారులు విఫలమయ్యారు. 47వ డివిజన్ అడ్డగుంటపల్లిలో గ్రామ దేవత అయిన పోచమ్మ ఆలయ పునఃనిర్మాణం పనులను రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్, మేయర్ బంగి అనిల్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొని పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల సదానందం పాల్గొన్నారు.

సుల్తానాబాద్, ఏప్రిల్ 7: సుల్తానాబాద్ పట్టణంలో మున్నూరు కాపు సంఘం వారి ఆధ్వర్యంలో పోచమ్మ తల్లికి బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. 250 కుటుంబాలకు చెందిన మున్నూరు కాపులస్తులు బోనాలు ఉత్సవాలలో పాల్గొన్నారు. ఒగ్గు కళాకారులు, పోతరాజుల ప్రదర్శనలు, మున్నూరు కాపు సంఘం నాయకులు గాజుల రాజమల్లు, ఆకుల నర్సయ్య పటేల్, అమిరిశెట్టి తిరుపతి, పోచన్న, ముత్యాలు తదితరుల కర్ర సాములు, ఆకాడా ప్రదర్శనలు అకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లుతో పాటు మున్నూరు కాపు సంఘం నాయకులుచ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంత్రి పూజలు

మంథనిరూరల్, ఏప్రిల్ 7: మండలంలోని కన్నాల గ్రామంలో శ్రీవేంకటస్వామిని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. అందరూ సుభిక్షంగా ఉండాలని స్వామి వారిని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో వివాహానికి హాజరయ్యారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నేతలు ఉన్నారు.



ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న మంత్రి శ్రీధర్‌బాబు

మల్లన్న సన్నిధిలో భక్తుల సందడి



పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

ఓదెల, ఏప్రిల్ 7 :మండల కేంద్రంలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఉగాది పండుగను పురస్కరించుకొని ముందస్తుగా భక్తులంతా ఆలయానికి తరలివచ్చి పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించారు. అలాగే మల్లికార్జున స్వామికి బోనాలను సమర్పించారు. ఇక్కడికి తరలివచ్చిన ప్రాంగణమంతా శివసత్తుల పూనకాలతో సందడి నెలకొంది. బంగారు పోచమ్మ, మదన పోచమ్మ ఆలయాల్లో భక్తులు మొక్కులను సమర్పించారు.

అమృత కలషాల పంపిణీ

ఫైవింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 7: సదాశయ ఫౌండేషన్, సత్యసాయి భక్తులు నిరుపేద కుటుంబాలకు ఆదివారం అమృత కలశాలలను పంపిణీ చేశారు. మానవ సేవయే మాధవ సేవ అనే సత్యసాయి చూపిన మార్గాన్ని అనుసరిస్తూ ప్రతినెల 12 నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులతో కూడిన అమృత కలశాలలను అందజేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కుటుంబానికి ఆకలి తీరేలా పప్పు, బియ్యం, చింతపండు వంటి 16 రకాల నిత్యావసర సరుకులు నెలకు సరిపడేలా అందజేస్తున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ గౌరవ సలహాదారు నూక రమేష్, సత్యసాయి భక్తులు అనంతుల రాజు, రాజమహేందర్‌రెడ్డి, సీతారాం, నర్సింహాచారి, హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత

కమాన్‌పూర్, ఏప్రిల్ 7 : మండల కేంద్రానికి చెందిన ఆరెల్లి మల్లేష్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబానికి ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పరామర్శించి 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మానవ వికాస వేదిక కళామండలి అధ్యక్షుడు దాసరి రామస్వామి, నాయకులు అంబటి కనుకయ్య, దాసరి రామ్ చందర్, పులిపాక దేవ, జంగాపల్లి లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

తండాల్లో ఎక్సైజ్ అధికారుల దాడులు

- 100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7: ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిపేట , వీర్నపల్లి మండలాల్లోని బుగ్గరాజేశ్వరతండా, రాశిగుట్టతండాల్లో ఎక్సైజ్ సీఐ ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు ఆదివారం మెరుపు దాడులు నిర్వహించారు. సారా తయారీ కేంద్రాలను కనుగొని నిల్వ చేసిన 100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. తరలించేందుకు సిద్ధంగా ఉన్న 14 లీటర్ల సారా, ద్విచక్రవాహనంతో పాటు సారా తయారీ ముడి సరుకైన 20 కిలోల పటిక, 10 కిలోల ఇప్పపువ్వును స్వాధీన పర్చుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ ఎం శ్రీనివాస్ చెప్పారు. సారా తయారీ, రవాణా, విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో తండాల్లో నిఘాను తీవ్రతరం చేశామని తెలిపారు. నిత్యం తనిఖీలు, దాడులు నిర్వహించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ ఎం. శ్రీనివాస్ స్పష్టం చేశారు. దాడుల్లో సిబ్బంది రాజు, కిశోర్, మల్లేశ్, కృష్ణకాంత్, లావణ్య, శ్రీవాణి పాల్గొన్నారు.


● కొదురుపాక గ్రామం


● రుద్రవరం గ్రామం


● రుద్రవరం వేణుగోపాల స్వామి ఆలయం

ఇంకిన నీటిలో కదలాడుతున్న జ్ఞాపకాలు

వందల మంది నడిచిన దారులు.. వేల మందికి తిండిపెట్టిన పొలాలు.. ఎండలు మండినా చల్లని నీటినిచ్చిన బావులు.. ఊరందరినీ కాపాడిన దేవుళ్ల ఆలయాలు.. పిల్లలకు చదువు నేర్పి పెద్ద చేసిన పాఠశాలలు.. ఇవి మావీ అనుకుని నిశ్చింతగా జీవనం గడిపిన ఇళ్లు.. ఇలా.. ఒక్కొక్క జ్ఞాపకం తడారుతున్న నేల నుంచి బయటకు వస్తూ నిర్వాసితుల గుండెలు మెలిపెడుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్మించిన మిడ్ మానేరు, అనంతగిరి ప్రాజెక్టుల్లో 11 గ్రామాలు, 19,446 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. కాళేశ్వరం నుంచి నీటి విడుదల నిలిచిపోవడంతో అనంతగిరి, మిడ్‌మానేరు ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గిపోయాయి. దీంతో ప్రాజెక్టుల్లో ముంపునకు గురైన గ్రామాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు అక్కడికి వచ్చి తమ గ్రామాలను, ఇళ్లను చూస్తూ కన్నీటి పర్యంతమవుతున్నారు. ■ ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల

- ప్రాజెక్టుల నిర్మాణానికి ఉన్న ఊరు.. తిండిపెట్టే భూములను ఇచ్చిన నిర్వాసితులు
- ప్రస్తుతం నీటిమట్టాలు తగ్గడంతో బయటపడుతున్న నాటి ఆనవాళ్లు
- అప్పటి రోజులను గుర్తు చేసుకుంటున్న గ్రామస్థులు

జిల్లాలోని మానేరు వాగుపై బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లో 11 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. 7419 ఇళ్లే, 19446 ఎకరాల వ్యవసాయ భూములు, ముంపునకు గురయ్యాయి. 10,131 కుటుంబాలు తమ ఇళ్లను వదిలిపోవాల్సి వచ్చింది. ప్రభుత్వం అరకొర పరిహారం చెల్లించినా, ఎన్నో రకాల అసంతృప్తులు ఉన్నా నిర్వాసితులు ఉన్న ఊరును విడిచిపెట్టి పోయారు. వినని వారిని ప్రభుత్వం బలవంతంగా ఖాళీ చేయించింది. తమ తాత, ముత్తాతల నాటి భూములు, ఇళ్లను వదిలి వెళ్లిన వారు కొత్త ప్రాంతాల్లో ఇమడ లేక నానా ఇబ్బందులు పడ్డారు. రోజులు గడుస్తున్న కొద్దీ ప్రాజెక్టుల్లో నీరు నింపడం ప్రారంభమైంది. ఒక్కొక్కటిగా గ్రామాలు నీటిలో మునిగిపోయాయి. మిడ్‌మానేరు అనుబంధంగా నిర్మించిన అన్నపూర్ణ ప్రాజెక్ట్ కూడా జిల్లాలోని ఇల్లంతకుంటలో ఉంది. 1.5 టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మించిన ప్రాజెక్ట్‌లో అనంతగిరి గ్రామం ముంపునకు గురయ్యింది. 3947 ఎకరాల భూమి, 1124 కుటుంబాలు తరలిపోయాయి.

ప్రస్తుతం వేసవి కాలంలో ఎండలు పెరిగాయి. కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతినడంతో మిడ్‌మానేరు, అన్నపూర్ణ ప్రాజెక్టులకు వచ్చే నీరు నిలిచిపోయింది. 27.50 టీఎంసీ సామర్థ్యం ఉన్న మిడ్‌మానేరు ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 7.50 టీఎంసీలు, అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లో 0.83 టీఎంసీలు మాత్రమే ఉంది. ప్రాజెక్ట్‌లలో నీరు తగ్గడంతో ముంపునకు గురైన గ్రామాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. దీంతో నాడు గ్రామాలను వదిలివెళ్లిన గ్రామస్థులు తమ ప్రాంతాలకు వచ్చి అప్పటి రోజులను గుర్తు చేసుకుంటున్నారు. తాము చదువుకున్న బడిని చూసి స్నేహితులతో ఆటలాడుకున్న స్థలాన్ని గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. శరీరం సహకరించకున్నా వృద్ధులు అక్కడికి వచ్చి తమ గ్రామాలను మళ్లీ చూస్తామో.. లేదోనని ఉద్విగ్నానికి గురవుతున్నారు.


● శాభాష్‌పల్లి గ్రామం


● చీర్లవంచ గ్రామం




● రుద్రవరం ప్రభుత్వ పాఠశాల

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ


క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

వేములవాడ, ఏప్రిల్ 7: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఆదివారం నాడు భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత ఆలయ కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరిం చారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ కారణంగా లఘు దర్శనం అమలు చేయడంతో భక్తులు నందీశ్వరుడి వద్ద నుంచి శ్రీ స్వామివారిని దర్శిం చుకున్నారు. కళాభవన్‌లో శ్రీ స్వామివారి నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరిదేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్ద సంఖ్యలో భక్తులు చెల్లించుకున్నారు. అనుబంధాలయమైన బద్దిపోచమ్మ ఆలయం సైతం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

ఘనంగా మహాలింగార్చన

వేములవాడ, ఏప్రిల్ 7: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి ఆదివారం మహా లింగార్చన, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా ఆలయ అర్చకులు ఉదయం వేళలో శ్రీ స్వామివారికి మహా మండపంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం శ్రీస్వామివారి కల్యాణ మండపంలో మహాలింగార్చన నిర్వహించారు. లింగాకారంలో అమర్చిన ప్రమిదలలో మహిళలు జ్యోతులు వెలిగించారు.

సమాజంలో అసమానతలను రూపుమాపాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 7: సమాజంలో అసమానతలను రూపుమాపడానికి కవులు, రచయితలు కృషి చేయాలని తెలంగాణ విశ్వవిద్యాలయ అవార్డు గ్రహీత, సాహితీవేత్త డాక్టర్ గంధ్ర లక్ష్మణ్‌రావు అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని పద్మశాలి సంఘ భవనంలో ఆదివారం సిరిసిల్ల జిల్లా సాహితీ సమితి 28వ వార్షికోత్సవం సందర్భంగా సామాజిక చైతన్య దీపిక, జ్ఞానదీపికలు, పలువురికి ఉగాది సత్కారాలు పురస్కారాలు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు రచయితలు, కవులను సత్కరించారు. కార్యక్రమంలో సిరిసిల్ల సాహితి సమితి అధ్యక్షుడు డాక్టర్ జనపాల శంకరయ్య, ప్రధాన కార్యదర్శి వెంగలలక్ష్మణ్, కవులు, రచయితలు గోశికొండ మురారి పంతులు, పోరండ్ల మురళీధర్, అఖిలభారత రచయితల సంఘం అధ్యక్షు జూకంటి జగన్నాథం, కరుణాల భద్రాచలం, అకునూరి శంకరయ్య, సీరు రమేష్, చేపూరి బుచ్చయ్య, గుండ్లపల్లి శ్రీనివాస్, శ్రీగాధ మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7: ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నామని పోలీసులు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తున్నారనే సమాచారంతో అక్కడకు చేరుకుని స్వాధీనపర్చుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పదేళ్ల పాలనలో ప్రజలకు న్యాయం జరగలేదు

- తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం


మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

గోదావరిఖని, ఏప్రిల్ 7: ఎందరో పోరాటాలు, బలిదానాలతో ఏర్పడిన తెలంగాణ లో పదేళ్ల పాలనలో ప్రజలకు న్యాయం జరుగలేదని తెలంగాణ జన సమితి అధ్య క్షుడు, ప్రొఫెసర్ కోదండరాం ఆరోపించారు. ఆదివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన తెలంగాణ ఉద్యోగుల సంఘం మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజ రై మాట్లాడారు. మన ఉద్యోగాలు, మన నీళ్లు, మన నియామకాల నినాదం గాలికి వదిలేశారని, కొద్ది మందికే సంపద మిగిలిందని, నిరుద్యోగ సమస్య తీరుతుందని ఆశపడ్డ నిరుద్యోగులకు నిరాశే మిగిలిందని, తెలంగాణ ఏర్పాటులో సింగరేణి కార్మి కుల పాత్ర మరిచిపోలేనిదని, 45రోజుల పాటు సమ్మె చేసి దేశ వ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కల్పించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా తెలం గాణ సస్యశ్యామలం అవుతుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. సింగరేణి కార్మికులకు పేస్‌వర్క్‌పై అలవెన్సులు చెల్లించాలని, కార్మికులు ఉత్పత్తి చేసిన బొగ్గులో లాభాల వాటాపై 40శాతం లాభాల వాటా ఇవ్వాలని, ఓపెన్‌కాస్టులతో కాలుష్యం వెదజల్లు తుందని, వీటి స్థానంలో భూగర్భ గనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులను పర్మినెంట్ చేయాలని, మెడికల్ కాలేజీలో సింగరేణి కార్మికుల పిల్లలకు 80శాతం రిజర్వేషన్ ఇవ్వాలని, సొంతింటి పథకం ద్వారా ఇల్లు ఇవ్వాలని, పదవీవిరమణ పొందిన కార్మికులకు రూ.20లక్షల హెల్త్ కార్డు, కార్మికులకు రూ.20లక్షల వడ్డీ లేని రుణం ఇవ్వాలని, కార్మికులు పని చేసేచోట నాణ్యమైన పనిముట్లను సమకూర్చాలని, కార్మికులందరికి క్యాడర్ స్కీం ఐదు సంవత్సరాలకు కుదించి అమలు చేయాలని, డిస్మిస్ కార్మికులకు ఎలాంటి నిబంధనలు లేకుండా అందరికి తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రామగుండం రీజియన్ కమిటీ అధ్యక్షులు కామెర గట్టయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి, తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు గురిజాల రవీందర్‌రా వు, సీనియర్ జర్నలిస్టు ఎండీ మునీర్, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అ హ్మద్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వనాథ్, రాములు, ఈదునూరి నరేష్, దేవి సత్యం, కనకయ్య, శేఖర్, వెంకటేషం, కుమార్, భీమయ్య, రాయలింగు, రాయపోషం, సలీంబేగ్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్న బోనాల జాతర


బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 7: మండలంలోని కోండ్రికర్ల గ్రామంలో కొలిచిన వారికి కొంగుబంగారంగా వెలిసిన మల్లన్న స్వామి బోనాల జాతర వైభవంగా నిర్వహించారు. ఏటా హోలీ తరువాత వచ్చే మొదటి ఆదివారం పెద్దాపూర్ మల్లన్న జాతర యాదవుల ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలను పురోహితుడు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శనివారం రాత్రి స్వామి వారి కల్యాణాన్ని పురోహితులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించిన అనంతరం బోనాల జాతర నిర్వహించారు. మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకొని శివశక్తుల పూనకాలు, పోతురాజుల నృత్యాలతో డప్పుచప్పుల్ల మధ్య ఆలయానికి చేరుకున్నారు. భక్తులు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆయాభివృద్ధి కమిటీ సభ్యులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో జాతర ఉత్సవాల్లో పాల్గొన్న భక్తుల కోసం గ్రామానికి చెందిన గడ్డం రాజారెడ్డి చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆలయాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: మల్యాల పరిధిలోని కొత్తపేటలో నూతనంగా నిర్మించిన ముత్యాల పోచమ్మతల్లి ఆలయంలో ఇటీవలే పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం జరుగగా ఆదివారం బోనాల వేడుక నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మకు మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా పోతరాజు వేషధారణ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎల్లాల జనార్ధన్‌రెడ్డి, అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి, నెరెళ్ల భూమరెడ్డి, ఒడ్డెపల్లి శశాంక్, పోతరాజు శ్రీనివాస్, పోతరాజు శ్రీధర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 7: మండలంలోని జోగినిపల్లి క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయికల్ మండల కేంద్రానికి చెందిన కటకం లక్ష్మీకాంతం (60) అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీకాతం కోరుట్ల మండలంలోని మాదాపూర్ గ్రామంలో జరిగిన విందు కార్యక్రమంలో పాల్గొన్ని తిరిగి ద్విచక్ర వాహనంపై రాయికల్ వెళుతున్నాడు. జోగినిపల్లి క్రాస్ రోడ్డు వద్దకు చేరుకోగా వాహనం అదుపు తప్ప రోడ్డు పక్కకు పడిపోయింది. దీంతో తీవ్ర గాయలై లక్ష్మీకాతం అక్కడిక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. లక్ష్మీకాతం బంధువుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కోరుట్ల ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు మృతదేహం అప్పగించినట్లు పోలీసులు వివరించారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

మల్యాల, ఏప్రిల్ 7: మండలంలోని ఓగులాపూర్‌కు చెందిన ఓ మహిళ అప్పుల బాధతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. బొజ్జ లక్ష్మి(38)అనే మహిళ అప్పుల బాధ భరించలేక శనివారం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆదివారం గ్రామ శివారులోని వేంకటెశ్వర్ల గుట్ట వద్ద చెట్టుకు ఉరి వేసుకొని కనిపించింది. దీంతో గ్రామస్థులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. లక్ష్మికి భర్తతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. లక్ష్మి భర్త బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై కృష్ణకుమార్ తెలిపారు.

పోలీసులకు బాలిక అప్పగింత

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 7 : పెద్దపల్లి మండలంలోని కాపులపల్లి గ్రామం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న బాలికను గమనించిన స్థానికులు కనగర్తి గ్రామహనుమాన్ ఆలయం వద్దకు తీసుకవచ్చి పోలీసులకు సమాచారం అందించారు. అంతకుముందు బాలికను వివరాలు అడుగగా తనది చొప్పదండి మండలం ఆర్నకొండ అని, గుర్తు తెలియని వ్యక్తులు తీసుకవచ్చి వదిలేసినట్లు తెలిపింది. పెద్దపల్లి ఎస్సై 2 మల్లేష్ పోలీస్ స్టేషన్‌కు తరలించి బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందించే ప్రయత్నంలో ఉన్నారు.

నేడు హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం

- నేతన్నల సమస్యలపై చర్చ
- జేఏసీ నాయకుల వెల్లడి


సిరిసిల్లలో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 7: సిరిసిల్ల నేతన్న సమస్యలపై సోమవారం హైదరాబాద్‌లో అల్ ట్రేడ్ యూనియన్స్ రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి చర్చించనున్నామని జేఏసీ నాయకులు ప్రకటించారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో ఆదివారం వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్య వేదిక జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ శనివారం రాత్రి సిరిసిల్ల జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన నేతన్నల గర్జనలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేసిందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపేలా ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు. వస్త్ర పరిశ్రమలపై అధారపడి జీవిస్తున్న నేతన్నలందరికీ ప్రభుత్వం వెంటనే ఉపాధిని కల్పించే విధంగా చర్యలు తీసుకునేలా పోరాడుతామని తెలిపారు. శనివారం రాజీవ్‌నగర్‌కు చెందిన సిరిపురం లక్ష్మీనారాయణ అనే మరమగ్గాల కార్మికుడు సరైన ఉపాధిలేక అర్థికంగా ఇబ్బందులు పడుతూ అత్మహత్యకు పాల్పడ్డారని చెప్పారు. కాగా చేనేత జౌళీశాఖ ఏడీ మాత్రం అనారోగ్యంతో చనిపోయినట్లు పత్రిక ప్రకటన ఇవ్వడం సరికాదన్నా రు. ప్రస్తుతం సిరిసిల్లలో సంక్షోభం వలన ఒక వైపు ఉపాధిలేక మరోవైపు అర్థికంగా ఇబ్బందులు భరించలేక మనస్తాపానికి గురై అత్మహత్య చేసుకుంటే అనారోగ్యం కారాణంగా అంటూ పత్రిక ప్రకటనను ఇవ్వడాన్ని ఖండిస్తున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్, ఎంపీ బండిసంజయ్‌కుమార్ చనిపోయిన కుటుంబాన్ని పరామర్శించి డబ్బులు అందిస్తే సరిపోదని చెప్పారు. మీరు ప్రాతినిత్యం వహిస్తున్న సిరిసిల్లలో నేతన్నల సమస్యల పరిష్కారం కోసం ఏమి చేస్తున్నారో ఆలోచించుకోవాలని హితవుపలికారు. నిజంగా అధికారులకు, ప్రభుత్వానికి , ప్రజాప్రతినిధుల కు చిత్తశుద్ధి ఉంటే మరోక కార్మికుడు బలికాకముందే వెంటనే సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సిరిసిల్ల నేతన్నల సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి సమస్యల పరిష్కారం కోసం సోమవారం హైదరాబా ద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అల్‌ట్రేడ్ యూనియన్ అధ్వర్యం లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో మూషం రమేష్, పంతం రవి, మండల సత్యం, తాటిపాముల దామో దర్, కట్టెకోల లక్ష్మీనారాయణ, సిరిసిల్ల రవీందర్, కోడం రమణ, సిరిమల్ల సత్యం, మండల రాజు, వెల్దండి దేవదాస్, గౌడరాజు, పిస్క మధు, వేములల దామెదర్, బోడ్డు శ్రీధర్, నక్క దేవదాస్, ఒగ్గు గణేష్, బండారి అశోక్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామగిరి, ఏప్రిల్ 7: మండలంలోని లద్నాపూర్ గ్రామానికి చెందిన ఉడుత సంతోష్(34) అనే వ్యక్తి గడ్డి మందు తాగగా చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం..సంతోష్ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఈనెల 3న గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు తొలుత పెద్ద పల్లి తరలించగా మెరుగైన వైద్యం కోసం వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. భార్య స్వరూప ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

నాయీబ్రాహ్మణ సంఘం కార్యవర్గం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 7: తెలంగాణ నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా రామగిరి అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా మేడిపల్లి తిరుపతి, ఉపాధ్యక్షుడిగా సీతారాములు, సహాయ కార్యదర్శులుగా నాగవెల్లి రవి, ముత్యాల రవి, ఆర్గనైజర్‌గా జెట్టి రవీందర్‌తో పాటు ఐదుగురు సభ్యులను ముఖ్య సలహాదారులుగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా ముత్యాల శంకర్ వ్యవహరించనున్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా గట్టయ్య

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 7: భారతీయ జనతా పార్టీ మండల కమిటీ(పట్టణ) అధ్యక్షుడిగా కొమ్ము గట్టయ్య నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి ఆదివారం నియామక పత్రాన్ని గట్టయ్యకు అందజేశారు. కాలనీ పరిధిలోని 15, 16, 17, 18, 19 డివిజన్లకు అధ్యక్షుడిగా గట్టయ్య వ్యవహరించనున్నారు. కాగా తన నియామకానికి సహకరించిన రామగుండం నియోజకవర్గ ఇంచార్జి కందుల సంధ్యారాణి, మాజీ జిల్లా కార్యదర్శి మూకిరి రాజు, నాయకులు శ్రీనివాస్, ఆకుల శశి, దాసరి శ్రీనివాస్, రాజేష్ నాయక్, లింగం నాయక్‌లను ధన్యవాదాలు తెలుపుతున్నట్టు గట్టయ్య ప్రకటనలో తెలిపారు.

ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా సదయ్య

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 7: మండలంలోని పెగడపల్లి గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షునిగా తూడి సదయ్య గెలుపొందారు. ఆదివారం ఫిషరీష్ శాఖ అధికారులు పెగడపల్లి ముదిరాజ్ సంఘం ఎన్నికలు నిర్వహించారు. తూడి సదయ్య ముదిరాజ్ గ్రామ శాఖ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కల్వల తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా పెండం సదయ్యలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సదయ్య మాట్లాడుతూ ముదిరాజ్ సంఘం అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని, ఏ సమస్యలు వచ్చిన సమస్యల పరిష్కారానికి పోరాడుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

రైతుల కోసం దీక్షలు చేయడం విడ్డూరం

రామగిరి, ఏప్రిల్ 7 : రైతుల కోసం పుట్టమధు రైతు దీక్షలు చేయడం విడ్డూరంగా ఉందని రామగిరి ఎంపీపీ ఆరెల్లి దేవక్క ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. అధికారంలో ఉండగా గుర్తుకు రాని రైతులు అధికారం కోల్పోగానే రైతులు గుర్తు రావడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు.

సంస్కృతిని చదువులతో మేళవించాలి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 7: మన సంస్కృతిని మన నుండి వేరు చేస్తే చెట్టు నుంచి వేరును వేరు చేసినట్టేనని, చెట్టు నుండి వేరును వేరు చేస్తే చెట్టు ఎలా బతుకదో అలాగే మన సంస్కృతి నుంచి మన చదువులను వేరు చేస్తే మనం మనంగా ఉండకుండా పరాయి వాళ్లుగా బతకాల్సి వస్తుందని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ అన్నారు. మన సంస్కృతిని చదువులతో మేళవించాలని అన్నారు. ఆదివారం స్థానిక సప్తగిరి కాలనీలోని సప్తగిరి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మన కరిక్యులంలో మనదైన భావజాలంతో స్థానికత, జాతీయత, దేశభక్తి, సంస్కృతి పరిరక్షణ వంటి అంశాలు ప్రధాన భూమికలుగా పాఠ్యాంశాలు రూపొందితే అది చదివిన విద్యార్థులు రేపటి నిజమైన భారతీయ పౌరులుగా ఎదిగే అవకాశాలుంటాయని అన్నారు. చదువంటే కేవలం బట్టిపట్టడం కాదని, జీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపించే విధంగా ఆలోచించే జ్ఞానాన్ని పెంపొందించడం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజ్ఞా భారతి చైర్మన్ డాక్టర్ ఎల్.రాజభాస్కర్‌రెడ్డి ప్రసంగించగా పాఠశాల చైర్మన్ మండల నగేశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అనితారెడ్డి, డైరెక్టర్ విపుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 7: రాష్ట్రంలోని చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారికి సంపూర్ణ సహ కారం అందించి చేయూత నివ్వాలని చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని చేనేత ఐక్య వేదిక అధ్యక్షుడు రాపోలు వీర మోహన్, రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు కోమటిపల్లి సదానం దం, కోశాధికారి చిలివేరి గణేశ్, కుడిక్యాల భాస్కర్, మ్యాడం రామకృష్ణ, తెలంగాణ మహిళా విభాగం రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షురాలు అంకారపు సునీత, ప్రధాన కార్యదర్శి గూడ లావ ణ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి పోచం సునిత కలిసి వినతిపత్రం సమర్పించారు. చేనేత కార్మికులకు రుణాలు ఇవ్వాలని, సబ్సిడీ పై నూలు, రంగులు అందించాలని కోరగా సీఎం సానుకూలం గా స్పందించారని వారు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 7: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన కొత్తపల్లి మండలం కమాన్‌పూర్‌కు చెందిన పి.రాజు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని కరీంనగర్ మూడవ ఠాణ పోలీసులు తెలిపారు. రాజు ఈనెల 2న కరీంనగర్‌లోని ఆదర్శనగర్ బోర్డు వద్ద గడ్డి మందు తాగగా కుటుంబ సభ్యులు అతడిని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. రాజు ఆత్మహత్యకు ఆయన అత్తింటి వారే కారణమని వారి వేదింపులతోనే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తల్లి మల్లవ్వ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పల్లె దవాఖానాలకు మోక్షమెప్పుడో?

- సబ్ సెంటర్లకు పక్కా భవనాలు మంజూరు - లోపిస్తున్న నాణ్యతా ప్రమాణాలు - వైద్య సేవలు అందక రోగుల తిప్పలు



పెద్దకల్వలలో పూర్తి అయిన పల్లె దవాఖానా



కనగర్తిలో పూర్తికాని భవనం

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 7 : గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వ పల్లె దవాఖానాలు ఏర్పాటుచేసింది. ఏళ్లుగా సబ్‌సెంటర్‌లకు పక్కా భవనాలు లేకపోవడంతో వైద్య సిబ్బంది, రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని రాగినేడు, రాఘవపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 8 సబ్ సెంటర్‌లకు పక్కా భవనాలను ఏడాదిక్రితం అప్పటి ప్రభుత్వం మంజూరుచేసింది. అయితే మండలంలోని మూలసాల, పెద్దకల్వల గ్రామాల్లో మాత్రమే సబ్ సెంటర్ నిర్మాణాలు పూర్తి అయ్యాయి. కనగర్తిలో 90 శాతం పూర్తి కాగా, హన్మంతునిపేట, కొత్తపల్లి గ్రామాల్లో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. తుర్కలమద్దికుంట, అప్పన్నపేట, పాలితం గ్రామాల్లో ఇప్పటివరకు స్థలాలు గుర్తించిన టెండర్‌లు వేయని పరిస్థితి ఉంది. పెద్దకల్వల, మూలసాల సబ్ సెంటర్ నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌లు పనులు పూర్తిచేసి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు అధికారులు వాటిని ప్రారంభించలేదు. పెద్దకల్వల సబ్‌సెంటర్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోగా, సెంటర్‌కి బిగించిన కిటికీలు ధ్వంసమయ్యాయి. దీంతో క్షేత్రస్థాయిలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు సకాలంలో వైద్య సేవలు, ఆరోగ్యపరమైన సలహాలు, సూచలను అందకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

రూ.20 లక్షలు మంజూరు

మండలంలోని నిర్మించనున్న సబ్ సెంటర్ పక్కా భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.20లక్షల రుపాయలు మంజూరుచేసింది. గతేడాది అధికారులు నిర్మాణాలకు టెండర్‌లు నిర్వహించగా కొన్ని గ్రామాల్లో స్థలాలు లేకపోవడంతో పనులు ఆలస్యమవుతున్నాయి.

నాణ్యత ప్రమాణాలు కరువు

మండలంలోని మూలసాల, పెద్దకల్వల గ్రామాల్లో సబ్ సెంటర్ నిర్మాణాలు పూర్తి అయ్యాయి. నిర్మాణ సమయంలో గోడలకు సరిగా క్యూరింగ్ చేయకపోవడంతో పగుళ్లు వచ్చాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అలాగే విద్యుత్, నీరు, నాణ్యత లేని తలుపులు ఏర్పాటుచేశారని, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంవల్ల కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా నిర్మాణ పనులు చేపడుతున్నారని పేర్కొంటున్నారు. రెండు సబ్ సెంటర్‌లు నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు.

అద్దె భవనాల్లో అరకొర సౌకర్యాలు

నిర్మాణం పూర్తయిన మూలసాల, పెద్దకల్వల గ్రామాల్లో పక్కా భవనాలు ప్రారంభించకపోగా వైద్య సిబ్బంది అరకొర వసతుల నడుమ విధులు నిర్వహిస్తున్నారు. మిగతా ఆరు సెంటర్‌లలో అప్పన్నపేట ఆయుర్వేద వైద్యశాలలో, పాలితం గ్రామపంచాయతీ భవనంలో, తుర్కలమద్దికుంట అద్దెభవనం, హన్మంతునిపేట, కొత్తపల్లి గ్రామాల సబ్ సెంటర్‌లు అద్దె భవనాల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. సబ్ సెంటర్ల పరిధిలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులకు వైద్యం అందిస్తున్నారు. ఇప్పటికైనా వసతులతో కూడిన పక్కా భవనాలు త్వరగా పూర్తి చేసి గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తేవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇసుక తవ్వకాలపై గరం..గరం..

- మానేరులో క్వారీల నిర్వహణకు ప్రభుత్వం అనుమతులు - అభ్యంతరం వ్యక్తం చేస్తున్న పరిసర గ్రామాల ప్రజలు

- తవ్వకాలు నిలిపివేయాలంటూ దీక్షలు - భూగర్భ జలాలు అడుగంటిపోతాయని ఆందోళన



కదంబాపూర్‌లో క్వారీ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 7: మానేరు పరివాక ప్రాంత గ్రామాల ప్రజల తాగునీటి అవసరాలు మరోవైపు సాగునీటి అవసరాలు తీరుస్తున్న మానేరు వాగులో ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని గట్టేపల్లి, కదంబాపూర్ తదితర గ్రామాల ప్రజలు కొన్ని రోజుల నుంచి డిమాండ్ చేస్తున్నారు. సుల్తానాబాద్ మండలంలోని గట్టేపల్లిలో రెండు ఇసుక క్వారీలకు, కదంబాపూర్ గ్రామాల్లో మానేరులో ఒక క్వారీకి ప్రభుత్వం అనుమతులను పునరుద్ధరించింది. ఈమేరకు కలెక్టర్ వారికి ప్రొసీడింగ్స్ జారీ చేశారు. క్వారీ నిర్వహణ అనుమతులు పొందినవారు గట్టేపల్లి, కదంబాపూర్ గ్రామాల్లోని మానేరు ఇసుక క్వారీల్లో తవ్వకాలు ప్రారంభించారు. గట్టేపల్లిలో మానేరులో తవ్వకాలు చేయడమే కాకుండా ఇతర ప్రాంతాలకు కూడా రవాణా చేస్తున్నారు. కదంబాపూర్ మానేరు వద్ద గతంలో నిలువ చేసి ఉన్న దాదాపు 30 వేల క్యూబిక్ మీటర్ల ఇసుకను తరలించేందుకు క్వారీ నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న గట్టేపల్లి గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఇసుక తవ్వకాలు చేపడితే ఈ ప్రాంతంలో తాగు, సాగునీటి సమస్య తలెత్తుతుందని, తవ్వకాలను నిలిపివేయాలని, అక్రమ రవాణా అపాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్‌కు, పెద్దపల్లి ఎమ్మెల్యే, ఇతర అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. అయినా మానేరులో తవ్వకాలు తరలింపులు ఆగకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు మానేరు వద్ద ఆందోళన చేశారు. దాంతో జిల్లా మైనింగ్ ఏడీ శ్రీనివాస్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తదితరులు మానేరు వద్దకు వచ్చి గ్రామస్తుల ఆందోళనను చేసి ఇసుక తవ్వకాలు నిలిపివేయిస్తామని చెప్పారు. కానీ ప్రజా ఆందోళనలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా క్వారీ నిర్వాహకులు మానేరులో ఇసుక తవ్వకాలు చేస్తున్నారని, ఒడ్డున ఇసుకను నిలువచేస్తూ రాత్రివేళల్లో అక్రమంగా రవాణా చేస్తున్నారని పార్టీలకతీతంగా నాయకులు ఒక్కటై శుక్రవారం మానేరు వద్ద రిలే నిరాహర దీక్షలకు పూనుకున్నారు. ఇసుక క్వారీలు ఇలాగే కొనసాగితే తాగునీటి ఎద్దడి తప్పదని, మరోవైపు పంటలకు కూడా సాగునీరు దొరకదని పేర్కొంటున్నారు. పెద్దపల్లి నియోజవర్గంలో ఆరు ఇసుక క్వారీలను ప్రభుత్వం రెన్యూవల్ చేసిందని, దాంతో ఆయా క్వారీల్లో ఇసుక తవ్వకాలకు తరలింపు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారని అఖిల పక్ష కమిటీ నేతలు తెలిపారు.

జిల్లాలో 18 క్వారీలకు అనుమతి : మైనింగ్ ఏడీ

జిల్లాలో ఇటీవల 18ఇసుక క్వారీలకు అనుమతిని పునరుద్ధరించినట్లు మైనింగ్ శాఖ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. ఆయన గట్టేపల్లిలో మాట్లాడుతూ కొన్ని నిబంధనలు పాటిస్తూ ఇసుకను తీయాలని, రవాణా చేయాలని ఆదేశించారని తెలిపారు. ఈ నిబంధనలు పాటించని క్వారీ నిర్వాహకుల అనుమతులు రద్దు చేస్తామన్నారు. కాగా, మానేరు పరివాహక ప్రాంత గ్రామాల నుంచి ఇసుకను లారీల ద్వారా తరలించే విధానాన్ని తాను వ్యతిరేకిస్తానని గతంలో పేర్కొన్న ప్రస్తుత ఎమ్మెల్యే తన హామీ నిలబెట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అలంకార ప్రాయంగా గ్రామీణ క్రీడాప్రాంగణాలు

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు - క్రీడాకారులకు అందని ప్రోత్సాహం



ఓదెల మోడల్ స్కూల్ వద్ద ఉన్న క్రీడా ప్రాంగణం



చెట్లతో నిండి ఉన్న క్రీడా మైదానం

ఓదెల, ఏప్రిల్ 7 : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ క్రీడాప్రాంగణాలు ఇప్పుడు ఎవరికి ఉపయోగం లేకుండాపోయాయి. వీటికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరుచేయగా, ఐదు సంవత్సరాల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడాప్రాంగణాలను నిర్మించింది. ప్రస్తుతం ఇవి అలం కారప్రాయంగా మిగిలిపోతున్నాయి. ఐదేళ్ల క్రితం ఓదెల మండలంలో 22గ్రామాల్లో గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడాప్రాంగణాలు మంజూరయ్యాయి. వీటి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం ఈజీఎస్ నిధులు రూ.57.76లక్షల 436 మంజూరు అయ్యాయి. మొక్కుబడిగా పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారని, దీంతో అవి నిరుపయోగంగా మారాయని క్రీడాకారులు, ప్రజలు ఆరోపిస్తున్నారు.

ముళ్లపొదలతో క్రీడామైదానాలు..

గ్రామాల్లో నిర్మించిన క్రీడా మైదానాలన్నీ ఇప్పుడు ఎలాంటి క్రీడలు, సామగ్రి లేక అడవులుగా మారాయి. ఏ మైదానాన్ని చూసినా గుంటలు, చెట్లు, ముళ్ల పొదలతో దర్శనమిస్తున్నాయి. అన్ని క్రీడలకుయోగ్యంగా ఉంటేనే చేసిన పనులను రికార్డు చేయాల్సి ఉంది, ఇదేమి లేకుండానే ఉపయోగం లేని క్రీడాప్రాంగణాలకు రూ.6లక్షలకు పైగా బిల్లులు చెల్లించారు. అలాగే క్రీడా మైదానం ఉన్న పాఠశాలల్లో సైతం వాటికే బోర్డులు తగిలించి ఇదే క్రీడాప్రాంగణం అని ఇక్కడి ప్రజాప్రతినిధులు, అధికారులు నిరూపించుకున్నారు. ఈ పరిస్థితి ఓదెల మోడల్ స్కూల్లో రూ.58వేల453 ఖర్చుచేసి ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణంలో నెలకొంది. మండలంలోని మిగతా గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రేపు ఉగాది పురస్కారాలు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 7: యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పురస్కారాలను జిల్లా కేంద్రంలో సిరి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం 9గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభించనున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నందనవేన రాజేందర్ యాదవ్, యాదవ చారిటబుల్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు మారం తిరుపతి యాదవ్ తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా ప్రతి ఏటా ఉగాది పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. జిల్లాలోని యాదవులలో ఆరు రంగాల్లో పలు సేవా, విశిష్టత గాని ఇతర సంఘానికి ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టిన వారిని సెలక్షన్ కమిటీ ద్వారా గుర్తించి సత్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా యాదవ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వేలుంల నాగరాజు యాదవ్, ముత్తారం మండల అధ్యక్షులు కాసు తిరుపతి యాదవ్, మంద భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ అధికారంలో ఉండగా రైతులు గుర్తు రాలేదా?'

మంథని, ఏప్రిల్ 7: రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతుల సమస్యలు గుర్తు రాలేదా అని కాంగ్రెస్ నేతలు అయిలి ప్రసాద్, ఉప్పట్ల శ్రీనివాస్, పోలు శివలు ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో ఇక్కడి రైతుల భూములను లాక్కొని నీటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తే జడ్పీ చైర్మన్‌పుట్ట మధు ఎందుకు అడ్డుకోలేక పోయారని వారు ప్రశ్నించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు దోపిడీ, హత్యా రాజకీయాలు చేసింది ఎవరో ప్రజలకు తెలుసన్నారు. రైతులకు ఎలా సాగు నీరు ఇవ్వాలో తమ నాయకుడికి పూర్తిస్థాయిలో అవగాహన ఉందన్నారు. గతంలో ఈ ప్రాంతంలో నీళ్ల వల్ల పంటలు మునిగితే ఎందుకు స్పందించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేయడం తగదన్నారు. ఈకార్యక్రమంలో మల్హర్ ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావు, నేతలు గోటికార్ కిషన్‌జీ, పెరవేన లింగయ్య యాదవ్, మంథని సత్యం, ఎరుకల ప్రవీణ్, ఐలి శ్రీనివాస్, పెంటరీ రాజు, గుండా పాపారావు, రమేష్, లైశెట్టి రాజు, జగదీష్ పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్



బెల్ట్‌లు సాధించిన కరాటే విద్యార్థులు

మంథని, ఏప్రిల్ 7: జేకేఏ షోటోకాన్ కరాటే విద్యార్థులకు స్థానిక శ్రీలక్ష్మిభారతి గార్డెన్స్‌లో కరాటే ఇన్‌స్ట్రక్టర్ కోండ్ర నాగరాజు ఆధ్వర్యంలో 53 మంది విద్యార్థులకు గ్రేడింగ్ టెస్టును ఆదివారం నిర్వహించారు. టెస్టులో ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు 12 జూనియర్ రెడ్, 10 ఎల్లో, 20 ఆరెంజ్, 6 గ్రీన్, 5 బ్రౌన్ బెల్టులను, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. గ్రేడింగ్ టెస్టును షోటోకాన్ కరాటే రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బానయ్య పర్యవేక్షించారు. కార్యక్రమంలో మంథని మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, కౌన్సిలర్ వీకే. రవిలు పాల్గొనగా విద్యార్థులను జేకేఏ సౌత్ ఇండియా ఇంఛార్జి రాపోలు సుదర్శన్ సీనియర్ మాస్టర్ పర్శా బక్కయ్య శంకర్‌లు అభినందించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా మామిడాల శ్రీనివాస్

పాలకుర్తి, ఏప్రిల్7: బీజేపీ పాలకుర్తి మండల అధ్యక్షుడిగా మామిడాల శ్రీనివాస్‌ను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జయ్యారం గ్రామానికి చెందిన శ్రీనివాస్ 30 సంవత్సరాల నుంచి బీజేపీలో పని చేస్తున్నాడన్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఆ ప్రాంతంలో పార్టీ అభివృద్ధి కోసం చేస్తున్న సేవలను గుర్తించి ఆయనను నియమించినట్లు సునిల్‌రెడ్డి తెలిపారు.

ముస్లింలకు రంజాన్ దుస్తులు పంపిణీ

పాలకుర్తి, ఏప్రిల్7: మండలం పరిధిలోని బసంత్‌నగర్‌తో పాటు పలు గ్రామాల్లో రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్ ఆదివారం ముస్లిం మహిళలకు దుస్తుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పర్షవేని శ్రీనివాస్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎండిన వరి పంటలు

-పరిహారం చెల్లించాలంటున్న రైతులు



ఎండిపోయిన వరి పంట

ధర్మారం, ఏప్రిల్7: మండలంలో ఎస్సారెస్పీ కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు అందక ఎండిపోయాయి. మండల కేంద్రంలో గల శీతల్ల చెరువులో సమృద్ధిగా నీరు లేకపోవడంతో పంటలు పూర్తిగా ఎండిపోయాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం ఎండిపోయిన పంట పొలంలో గొర్రెలను మేపారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

'మంత్రి శ్రీధర్‌బాబును విమర్శిస్తే ఊరుకోం'

కమాన్‌పూర్, ఏప్రిల్ 7: మంత్రి శ్రీధర్‌బాబు, అతని కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు విమర్శిస్తే ఊరుకునేది లేదని కమాన్‌పూర్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వైనాల రాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో మంథని ఎమ్మెల్యేగా ఉన్న పుట్ట మధు నియోజకవర్గాన్ని ఎలా నష్టపరిచారో అందరికి తెలుసన్నారు. ఈప్రాంత రైతుల కోసం ఎల్లంపల్లి ప్రాజెక్టును కట్టించిన విషయాన్ని గుర్తు చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడుతున్న మంత్రి శ్రీధర్‌బాబుపై మరోసారి తప్పుడు వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధికార ప్రతినిధి చొప్పరి రాజశేఖర్, నాయకులు కొంతం శ్రీనివాస్, చిక్కుళ్ల శ్రీనివాస్, దండేపల్లి రవి, నిరంజన్, లస్కర్ తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ కార్యదర్శి

కమాన్‌పూర్, ఏప్రిల్7: మండలంలోని సిద్ధిపల్లి, పెంచికల్‌పేట, రొంపికుంట గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆ సంఘం కార్యదర్శి తిమ్మరాజు సంతోష్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను రైతులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, సిబ్బంది ఉన్నారు.



టీబీజీకేఎస్‌కు దేవ వెంకటేశం రాజీనామా

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 7: తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘానికి సీనియర్ నాయకుడు, చర్చల కమిటీ ప్రతినిధి దేవ వెంకటేశం రాజీనామా చేశారు. యూనియన్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్ఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తూ, 2017లో టీబీజీకేఎస్ యూనియన్‌లో చేరిన దేవ వెంకటేశం యూనియన్‌లో కార్పొరేట్ చర్చల ప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కోల్‌బెల్ట్ వ్యాప్తంగా బీఆర్ఎస్ అభ్యర్థులు ఓడిపోయిన కారణంగా తదనంతరం జరిగిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో యూనియన్ పోటీ చేయకపోవడంతో యూనియన్ వ్యవహారాలకు దూరంగా ఉంటున్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి

గోదావరిఖని, ఏప్రిల్ 7: కార్మిక సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని, పార్లమెంట్‌లో గొంతు విప్పేందుకు తనకు అవకాశం కల్పించాలని పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ సింగరేణి కార్మికులను కోరారు. ఆదివారం జీడీకే ఓసీపీ-5లో కార్మికులను కలిసివచ్చే ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సింగరేణిలో తాను కూడా కార్మికునిగా పని చేశానని, కేసీఆర్ తనకు ఎంపీ టికెట్ కేటాయించా రని, తనను పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. 5వ వేజ్‌బోర్డు సాధన కోసం తాను ఆమరణ నిరాహార దీక్ష చేసింది సింగరేణి కార్మికులందరికి తెలుసునని ఆయన గుర్తు చేశారు. జీడీకే 7ఎల్ఈపీ ప్రమాద సందర్భంలో అప్పటి చంద్రబాబు ప్రభుత్వంలో ఎక్స్‌గ్రేషియా కోసం కొట్లాడితే తనను జైలుకు కూడా పంపించారని ఈశ్వర్ అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మిర్యాల రాజిరెడ్డి, నాయకులు నూనె కొమురయ్య, జాహెద్‌పాషా, వడ్డేపల్లి శంకర్, పర్లపల్లి రవి, నారాయణ దాసు మారుతి ఉన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్